పాతికేళ్ల జీవితంలో పడిన కష్టాలను, పడని సుఖాలను, తిన్న తిట్లను తినని స్వీట్లూ హాట్లను, కొన్న కర్తిని, అమ్మిన అసలును, వక్రించిన చంద్రుణ్ణి, వక్రించని సూర్యుణ్ణి అందరినీ అన్నిటినీ తలచుకొని నమస్కారం చేసి శ్రీకారం చుట్టబోయేసరికి తమ్ముడు 'హాచ్ఛ'ని ఒకే ఒక్క కర్తిలేని తుమ్ము తుమ్మాడు!

'ఆ తుమ్ము ఇంకోటి తుమ్మలేకపోయావా?' అన్నా.

'అసలుకే మోసమైతే వడ్డీకి చోటేది? ఇంతకు నీ ఘనకార్యం ఏమిటని తుమ్ము దగ్గిరే తుమ్మకంచెలా మీద పడ్డావ్?'

'ఇది నా జీవిత రజతోత్సవం. ఈనాటికి నేను

# రజతోత్సవం



## పి.యస్.ప్రసాద్

పుట్టి పాతికేళ్లయింది. ఈ పాతికేళ్ల జీవితాన్ని పురస్కరించుకుని!...'

'చిన్న సైజు పార్టీ ఎరేంజి చేశావా?'

'లేదు.'

'ఓ చిన్న సభ?'

'లేదు.'

'ఓ చిన్న సన్మానం?'

'లేదు.'

'కనీసం ఓ కొత్త చొక్కా?'

'అదీ లేదు.'

'ఇక లేవిదేది?'

'అదే తోచడంలా. ఆదిలో హంసపాదులా పాదులోనే పందికొక్కు కొట్టింది. ఇక యీ వా జీవనలత కృంగి కృశించి నశించి నాశనమయేలోగా ఒక చిన్న కథ రాసి పది – పదిహేను కాపీలు తీసి పుట్టి పెరుగుతూ చావబోయే ప్రతి పత్రికకూ పంపాలని నిశ్చయించుకుని...'

'నయమే? ఆడ పేరుతోనా? మగ పేరుతోనా?'

'ఛీ! ఆడపేరేమిటి? అయినా ఈ మధ్య ఆడవాళ్లే మొగాళ్ల పేరుతో కథలు రాస్తున్నారు – లేని మీసాలు మెలితిప్పుతూ – కయ్యానికి కాలు దువ్వుతూ...'

'బై ది బై! తమ రిప్పటికి ఎన్ని రచనలు చేశారు?'

'కనీసం రెండు వందలు.'

'ఎన్ని ప్రింటయినాయి?'

'ఓ ఇరవై.'

'ఏటే! ఏడాది కొకటి కూడా లేదే.'

'ఓరి నీ సరాసరి బంగారం కామా! పుట్టిన ఏడాదిలోనే కథ రాశానా? మదీయ ఇరవైయవ ఏట ముద్దు ముద్దుగా కథా రచన మొదలెట్టి టపా టపా ఏడాదికి మూడు కథలు – వెరసి పదిహేను కథలు – రెండు కవితలు – రెండు వ్యాసాలు – అన్నట్టు ఓ ఉత్తరం –'

'అఘోరించావులేకాని – ఒక్కటి వాసియైన రచన...'

'వాసి? వాటీజ్ వాసి అండ్ వాటీజ్ నాసి? మన రచనల్లో నాసినాస్తి వాసి హస్తవాసి బట్టి అనుకో – అంటే పత్రికల పాఠకుల హస్తవాసి – కొందరు తిట్టారు – కొందరు దులిపారు – కొందరు దుమ్మెత్తిపోశారు – కొందరు పొగిడారు – కొందరు నవ్వారు – కొందరు ఏడ్చారు – అందర్నీ అన్ని వేళలా ఏడ్చేలా లేదా నవ్వేలా చేసేందుకు నేను బ్రహ్మదేవుణ్ణనుకున్నావా?'

'అదే నాన్సెన్స్! రచయిత కూడా బ్రహ్మ – దేవుళ్లాంటివాడే! రచన సప్త సంతానాల్లో ఒకటని అప్ప కవి ఘోషించలేదా? రవి కాననిచో కవి కాంచునేకదా?'

'ఆహా! అయితే నేను బ్రహ్మదేవుణ్ణన్నమాట? థాంక్యూ! కొత్త ఐడియా వచ్చింది – 'నేనూ బ్రహ్మదేవుణ్ణే!' అనే పేరుతో ఈ సందర్భంగా అందమైన కథ వ్రాసి...'

'తిప్పి పంపటానికి తగిన పోస్టలు బిళ్ల లంటించిన కవరుతో జత చేసి పంపిస్తావా?'

'అరె! ఈ ఆనందకర శుభ సమయంలో తిప్పి పంపే ప్రసక్తి ఏమిట్రా? శుభం పలకరా మంకెన్నా అంటే...'

'ఉన్న మాటన్నాను! నీవొక బ్రహ్మ వెలాగో – అలాగే ఎకౌంట్సాఫీసరువు కూడా! నీ ప్రెస్ మేటర్ రిసీట్ అండ్ డెలివరీ రెజిస్టర్‌ను ఆడిట్ చేయించావా?'

'డియర్ మిస్టర్ చిత్రగుప్తా! నా చచ్చిన ఆర్టికల్సును – అంటే సిగ్గు లేకుండా అయిదోమారు పంపిన ఆర్టికలును అంతకంటే సానుభూతాలు లేకుండా తిప్పి పంపగా రిసీవ్ చేసుకున్న ఆర్టికల్సును వన్స్‌ఫరాల్ ఒరిజినల్స్‌తో సహా వంటింట్లో కుంపట్రాజబెట్టే సెక్షనుకు డిస్పాచ్ చేశాను – అవి హవిస్సులా అగ్ని ద్వారా యముడికి ఈ పాటికి చేరే ఉంటాయి. ఇక బతికిన ఆర్టికల్సును – అంటే ఎవరో ఓ ఎడిటర్ మహాశయుడు ఇంతకంటే గతి లేక, కథ వేసుకుని ఫ్రీ కాపీ పంపే ఓపిక లేక మానేస్తే నేనే కొనుక్కుని నాకు నేనే సన్మాన సభ ఏర్పాటు చేసుకుని సింగల్ టీతో ఆత్మారాముడికి తృప్తి చేసి నామనస్సులోనే వెంకటేశ్వరస్వామి పాద పద్మాలకు కోటి నమస్కృతు లర్పించి...!

'ఖర్మకాలి వాటెని అంకితం చేయలేదుకదా?'

'మరే! ఆ పనే! ఖర్మ కాలిన పనే చేశాను – అప్పట్నుంచీ ఒక్క ఆర్టికలు పడితే ఒట్టు!'

'నెవర్ మైండ్ డియర్ బ్రదర్! నీ ఆర్టికల్సును తిప్పి పంపుతున్న ఈ ఎడిటర్లే ఒకనాడు నిన్నే ఆర్టికల్సు కోరే శుభ క్షణం రాకపోదు – ఆనాడు అరచేతి మందాన అలముకున్న నీ కీర్తి మేఘం – అందరు పేరుమోసిన రచయితల కీర్తి చంద్రికలను కాటేసి కలవర పెట్టేస్తుంది – బై ది బై – అప్పుడైనా పార్టీ చేస్తావా?'

'పార్క్‌లాం!'

'అదేమిటి? కామరాజ్‌లా?'

'ఆమ! పార్క్‌లాం!

'అన్నట్టు ఈ శుభక్షణంలో నీ ఆదాయ వ్యయాలను చెప్తే సంతోషిస్తాను.'

'ఏముందీ! రెండు వందల ఆర్టికల్సుకు బుక్ పోస్టు ఛార్జి అరవై రూప్యంబులు మాత్రము – ఆదాయం – ఆరు కథలకు ఫ్రీ కాపీలు – అందు రెండు కథలకు ఇరవై రూపాయలు'—.

'పోనీలే అన్నా! నేనుసైతం ప్రపంచాగ్నికి ఒక్క సమిధను ఆహుతిచ్చాను – అనుకో!'

'అవును! నేనుసైతం ప్రపంచంలో తెల్లరేకై పల్లవిస్తాను.'

'పల్లవించుగాని – ఈ శుభ సందర్భంలో నీకు ఏమని శుభాకాంక్ష లందించమంటావు?'

'ఏముందీ! వారానికి మూడు ఆర్టికల్సు చొప్పున పడి నెలకు వంద రూపాయలాదాయం వచ్చుగాక అని ఆకాంక్షించు!'

ఇంతలో 'పోస్టు సార్!' అన్న కేక విన్పించింది.

ఆదరాబాదరాగా ఇద్దరం వరండాలో కెళ్లాం – అతను చిరునవ్వు నవ్వుతూ, 'ఇవిగో సార్! మీవి రెండు ఆర్టికల్సు తిరిగొచ్చాయి...'

అప్పటికే నా మొహం నల్లబడింది –

'...అన్నట్టు ఒక కవరుకు మీరు పది పైసలు తక్కువ అంటించారు – అందుకని పోస్టలువారు మరో పది పైసలు అదనపు ఫైను వేసి సన్మానించారు!' అన్నాడు నా నల్లబడ్డ ముఖాన్ని తెల్లటి కళ్లతో చూస్తూ!

హతోస్మి! శ్రీ మద్రమారమణ గోవిందో హరి!